


23న సర్కిల్ స్థాయి డాక్ అదాలత్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఈ నెల 23న విజయవాడ వేదికగా సర్కిల్ స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని తపాలా కార్యాలయాలలో అందించే సేవలకు సంబంధించిన అంశాలపై 23న ఉదయం 11.30 గంటలకు విజయవాడ పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఫిర్యాదులను ఈ నెల 18వ తేదీ లోగా మెయిల్ లేదా పోస్టల్ ద్వారా కె. సుధీర్ బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ - 520 013 చిరునామాకు పంపించాలని సూచించారు. పోస్ట్ కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలని ప్రకటనలో తెలిపారు.

అదంతా రెండేళ్ల క్రితం వరకు రాళ్లు, రప్పలు, దట్టమైన ముళ్లపొదలతో నిండి ఉన్న ప్రాంతం. అటువైపు వెళ్లాలంటేనే.. అది ఎందుకూ పనికిరాదు, ఎలాంటి ఉపయోగం ఉండదనే భావన. ఔను... అచ్చంగా ఇటువంటి భూమినే గిరిజనులకు ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం భూమి కేటాయించిందన్న ఆనందం కన్నా రాళ్ల భూములపై పంటలు ఎలా సాగుచేస్తామన్న నిరాశే ఎక్కువగా గిరిజనులను వేధించింది. దీన్ని గుర్తించిన డ్వామా (నీటి యాజమాన్య సంస్థ/ ఉపాధి హామీ) అధికారులు గిరిజనులతో కలగలిసి పంటలు సాగుచేస్తే జీవితాలు మారుతాయని, అవసరమైతే ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అందిస్తామని మానసిక స్థైర్యాన్ని, మనో నిబ్బరాన్ని కల్పించారు. అదే నిబ్బరంతో కొండను పిండిచేసిన రైతులు రతనాల సాగు చేస్తున్నారు.



ఏడాదిన్నర క్రితం కొండపై మొక్కలను నాటుతున్న గిరిజనులు

రాళ్ల భూములపై
రతనాల సాగు

- కొండను పిండిచేసి పండ్ల మొక్కలు నాటిన గిరిజనులు
- ఊటను ఒడిసిపట్టి ఫారం పాండ్లకు మళ్లించిన డ్వామా
- 26 ఎకరాల్లో ఏపుగా పెరుగుతున్న జీడి, మామిడితోట

ఔను! చాలా ఆనందంగా ఉంది



రామతీర్థం కొండపై గిరిజనులు మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉంది. ఆ ప్రాంతమంతా రాళ్లగుట్టలతో నిండి ఉండడం వల్ల వారు ముందుకు రాలేదు. ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని చెప్పడమే కాదు. కొండనీటి ధారను మళ్లించి, ఫారం పాండ్లు ఏర్పాటుచేయడంతో వారిలో ఆశలు చిగురించి సాగుకు ముందుకు వచ్చారు. ఇందులో మా ప్రయత్నం కన్నా వారి సంకల్పం గొప్పది.

- జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ





పెరిగిన మొక్క వద్ద గిరిజనుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలం రామతీర్థం. ఇది రాష్ట్రంలోని పెద్దగా పరిచయం అక్కర్లేని ప్రాంతం. తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత గుర్తింపుగలిగిన ఆధ్యాత్మిక కేంద్రం ఇది. ప్రభుత్వం తరపున శ్రీరామనవమి ఉత్సవాలు కూడా ఇక్కడ నిర్వహిస్తుంటారు. ఆ విధంగా ఇక్కడికి వచ్చే సందర్భాలకు కనిపించే బోడికొండకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంపై ఆధారపడుతూ ఇదే గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు దశాబ్దాల తరబడి కాలం వెళ్లదీస్తున్నాయి. వీరికి సాగుభూమి ఇవ్వడం ద్వారా జీవనోపాధి మెరుగుపర్చాలని సంకల్పించిన ప్రభుత్వం 2020లో 18 మంది గిరిజన రైతులకు ఆర్ఒఎఫ్ఆర్ పథకం కింద సుమారు 26 ఎకరాల భూమికి పట్టాలు మంజూరు చేసింది. పట్టాలైతే వచ్చాయిగానీ, కేటాయించిన భూమి మొత్తం రాళ్లు రప్పలతో నిండి ఉంది. వాటిని ఆవరించి దట్టమైన ముళ్లపొదలు. సాగునీటికి అవకాశమే లేదు. ఇటువంటి భూమిలో పంటలు ఎలా సాగుచేస్తాం? అంటూ తలలు పట్టుకుని సుమారు ఏడాది కాలం ఆ దరిదాపునకు వెళ్లలేదు.

సాగుకు గిరిజనులు వెనుకాడుతున్న విషయం స్థానిక ఉపాధి హామీ సిబ్బంది ద్వారా

మానసిక స్థైర్యం నింపి..

డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి వరకు వెళ్లింది. తెలిసిందే తడవుగా డ్వామా పీడీ మొదలుకుని స్థానిక అధికారులు, సిబ్బంది ఆ గ్రామాన్ని సందర్శించి, గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించి భూమి సాగుచేస్తామనుకుంటే ప్రభుత్వం తరపున ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తామని హామీ ఇచ్చారు. 'తాడు ఉందని గేదెను కొనగలమా? అన్నట్టు మీరు మొక్కలు ఇస్తారని సాగునీరు లేక రాళ్లు రప్పలతో నిండివున్న కొండవాలు ప్రాంతంలో సాగుచేసుకోగలమా' అంటూ కుశలంగా ఎదురు ప్రశ్నలు వేశారు గిరిజనులు. దీంతో, ఆ మరుసటి రోజే గిరిజనులకు కేటాయించిన భూమితోపాటు దానికి ఎగువ భాగంలో ఉన్న కొండశిఖరాలను కూడా పరిశీలించారు డ్వామా అధికారులు, సిబ్బంది. ఆపైనుంచి జాలువారుతున్న సన్నటి నీటి ధారను గుర్తించారు. దాన్ని ఒడిసిపట్ట రైతులకు ఉపయోగపడే విధంగా మళ్లించాలని సంకల్పించారు. మరోవైపు పండ్లతోటలకు ఎంతో అనువైన భూమి అంటూ గిరిజనుల్లో మానశిక స్థైర్యాన్ని పెంచారు. మనో నిబ్బరాన్ని కల్పించారు. మొక్కల పెంపకానికి నీటి సదుపాయం కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన నిబ్బరంతో గిరిజనులు తమకు కేటాయించిన భూముల్లోని రాళ్లగుట్టలను రాసిరంపాన పట్టారు. ఎవరికి కేటాయించిన భూమిలో వారే ఇంటిల్లిపాది కలిసి చదును చేశారు.

నీటిధారను ఒడిసిపట్టి..

గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం డ్వామా అధికారులు కూడా సాగుభూమికి దగ్గర్లో ఫారంపాండ్లు తయారు చేసి, అందులోకి కొండరాళ్ల నుంచి జారువాలుతున్న నీటి ఊటను మళ్లించారు. జీడి, మామిడి మొక్కలను ఉచితంగానే పంపిణీ చేశారు. నాటిన మొక్కలకు ఫారం పాండ్ల నుంచి గిరిజనులు కావుళ్లతో నీటిని తెచ్చి సాగుచేశారు. ఇదంతా ఏడాది క్రితం మాట. ఇప్పుడు ఆ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మరో రెండేళ్లలో ఫలసాయాన్ని సైతం అందించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే మొక్కలు పెరుగుతున్న కొద్దీ ఇప్పుడున్న నీటి వసతి సరిపోదన్నది గిరిజన రైతుల నోట వినిపిస్తున్న మాట. విద్యుత్ కనెక్షన్‌తో కూడిన బోరు లేదా లిఫ్ట్ ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపి నట్టు అవుతుంద నడంలో సందేహం లేదు.

ఉపాధి అధికారుల సాయంతోనే సాగు




మాకు ఇచ్చింది ఎందుకూ పనికిరాని భూమి అనుకున్నాం. ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది చెప్పినా సాగు చేసేందుకు చాలా కాలం సాహసించలేకపోయాం. చివరకు వాళ్లే కొండపైనీటి ధారను మాకోసం ఒడిసి పట్టినప్పుడు అచేతనంగా ఉండలేకపోయాం. వారిచ్చిన హామీతో కొండను చదునుచేసి, మళ్లతుప్పలను తొలగించి చదునుగా మార్చుకున్నాం. ఇప్పుడు సాగుపైనే కాదు బతకుపైనా భరోసా కనిపిస్తోంది. అయితే, ప్రస్తుతం ఉన్న నీటి సదుపాయం భవిష్యత్తులో సరిపోదు. కాబట్టి, ఏదో రకంగా నీటి వసతిని ప్రభుత్వమే పెంచాలని కోరుతున్నాం.

- కొమరాపు ఆదిలక్ష్మి, రామతీర్థం, నెల్లిమర్ల మండలం



కావిళ్లతో నీటిని తీసుకెళ్తున్న గిరిజనులు



నియామకపత్రాలను అందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సేవా దృక్పథంతో పనిచేయాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో వార్డు వాలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర సూచించారు. మంగళవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో 15 మంది వాలంటీర్లకు నియామక పత్రాలను ఆయనతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు అందజేశారు. కొద్దిరోజులపాటు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 19 వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. వీరిలో ఎంపికైన 15 మందికి నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన నాలుగు పోస్టులకు సంబంధించిన రిజర్వుడు కేటగిరీలో అభ్యర్థులు దొరక్కపోవడంతో భర్తీకి నోచుకోలేదు. ఇప్పటికే రెండు సార్లు వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినా భర్తీకి అధికారులు చర్యలు తీసుకోలేదు.

మూడోసారి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వాలంటీర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. చైర్ పర్సన్ ఈశ్వరమ్మ, ఇతర కౌన్సిలర్ల మధ్య అవగాహన కుదరడం, ఏ వార్డులో వాలంటీర్ పోస్టు ఖాళీ ఉంటే సంబంధిత కౌన్సిలర్ సిఫార్సు ప్రకారం భర్తీ చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదేశించారు. దీంతో వాలంటీర్ పోస్టుల భర్తీకి లైన్‌క్లియర్ అయింది. మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూడాలని కోరారు.

'గణతంత్ర' వేడుకకు పక్కాగా ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మైదానంలో ఏర్పాట్లను రహదారులు భవనాల శాఖ చేయాలని, వేదిక పర్యవేక్షణ రెవెన్యూ డివిజనల్ అధికారి చూడాలని ఆయన ఆదేశించారు. పూర్తి స్థాయిలో పోలీస్ పరేడ్, బందోబస్తు ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మైదానంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని చెప్పారు. గణతంత్ర వేడుకలకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఇపిడిసిఎల్ అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మైదానం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు శకటాలను, రవాణా శాఖ, ఐసిడిఎస్, అటవీశాఖ తదితర శాఖలు ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రదర్శనశాల ఏర్పాటుకు డిఆర్‌డిఎ పీడీ, శకటాల ఏర్పాటుకు డ్వామా పీడీ సమన్వయకర్తలుగా ఉంటారని చెప్పారు. కొత్త జిల్లాలో తొలిసారి నిర్వహించే గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



జ్యోతిబసు వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఆదర్శమూర్తి జ్యోతిబసు

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతానగరం

కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు అందరికీ ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. జ్యోతిబసు 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని చినబోగిలి గ్రామంలో ఆయన చిత్రపటానికి రెడ్డి వేణు, బోరపురెడ్డి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి 23 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా జ్యోతిబసు అనేక సేవలు అందించి చరిత్రలో సృష్టించారన్నారు. అధికారం అలంకరణ కాదని, ఆడంబరం కాకూడదని, ఆపన్నులకు తోడుగా నిలవాలని, అవసరం ఉన్నవారికి అండ కావాలని జ్యోతిబసు ఆశించి.. ఆచరించారని కొనియాడారు. దున్నే వాడికి భూమిహక్కు ఉండాలని కోరుకున్నారని తెలిపారు.

జ్యోతిబసు స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు తిరుగుముఖం

భోగి.. పెద్దపండగ... కనుమ.. ముక్కనుమ ముగిశాయి. భోగి మంటలు.. ముగ్గుల పోటీలు.. డూడూ బసవన్నలు.. హరిదాసు కీర్తనలు, కబడ్డీ కేకలు.. క్రికెట్ కేరింతలు.. వంటకాల ఘుమఘుమలు... పేరంటాల సందళ్లు... కనుమ పూజలతో కళకళలాడిన గ్రామసీమలు ఖాళీ అవుతున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా సంక్రాంతికి సొంతూళ్లు వచ్చి బరువెక్కిన హృదయాలతో తమ వారికి బై... బై చెబుతూ మళ్లీ వలస బాట పడుతున్నారు. దీంతో నాలుగు రోజులపాటు కళకళలాడిన పల్లెలు ఒక్కసారిగా బోసిపోతున్నాయి.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



తిరుగు ప్రయాణంలో విజయనగరం బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగకు వచ్చిన వారంతా పట్టణాలకు తిరుగుముఖం పడుతున్నారు. దీంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోగా, రోడ్లన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. ముచ్చటగా మూడు రోజులపాటు జరిగిన భోగి, సంక్రాంతి, కనుమ పండగలో బంధువులు, స్నేహితులు పరస్పర కరచాలనం, అనురాగం, ఆప్యాయత, పలకరింపులు ఒకింత ఉత్తేజ పరిచాయి. అందరిలోనూ ఉద్వేగాన్ని నింపాయి. పండుగలో ప్రతి క్షణం తీపిగుర్తుగానే మిగిల్చింది. కనుమ, ముక్కనుమ రోజుల్లో పాడి పశువులను పూజించడం సంప్రదాయంగా వస్తుంది. జిల్లాలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ఇటువంటి సందడి కూడా తగ్గింది. కానీ, ఈ ఏడాది మరో ప్రత్యేక కనిపించింది. ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండి పండక్కి వచ్చినవారంతా తమ ఊళ్లలో ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలతో సరదాగా గడిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నది తీర ప్రాంతాల్లోని ఇసుక తిన్నెలపై ఉల్లాసంగా సందడి చేశారు. మరోవైపు పండుగ ముగియడంతో గ్రామాల్లో తీర్థాలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వేర్వేరు చోట్ల ఉంటున్న ప్రజలు పట్టణాలకు బయలుదేరడంతో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు నుంచి విజయనగరం, విశాఖవైపు వెళ్లే బస్సులన్నీ కిటకిటలాడాయి. గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. రైళ్లు కూడా రద్దీగా మారాయి. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే వారంతా ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్నారు. రిజర్వేషన్లు లేని వారిని ప్రయివేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించారు. ఇదే అదునుగా ప్రయివేటు ట్రావెల్స్ ఛార్జీలను విపరీతంగా పెంచేశాయి.

2 'చేనేత' క్లస్టర్లు మంజూరు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జాతీయ చేనేత అభివృద్ధి పథకం (ఎన్‌హెచ్‌డిపి)లో భాగంగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద జిల్లాకు రెండు క్లస్టర్లు మంజూరైనట్లు జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఐ.ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ, నారాయణపురంలో ఈ క్లస్టర్లు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా రాష్ట్రంలో మొత్తం ఏడు క్లస్టర్లు మంజూరైనట్లు వెల్లడించారు. మంజూరైన క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో టెక్స్‌టైల్ డిజైనర్-7 పోస్టులు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్- 7 పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. డైరెక్టర్, చేనేత, జౌళి శాఖ, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

19లోగా ఉత్తమ ఉద్యోగుల జాబితా అందించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఈ నెల 19వ తేదీలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జెసి ఆనంద్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. అందుకుగాను ప్రతి శాఖ నుంచి ఇద్దరు ఉద్యోగుల కంటే ఎక్కువ మంది వివరాలను సమర్పించరాదని ఆయన స్పష్టం చేశారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

హైరిస్క్ గర్భిణులు, నవజాత శిశువులపై ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలో చినంకలాం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ, టీకా నిర్వహణ కు సంబంధించిన మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం వినియోగించుకోవాలని కోరారు.



బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

పైడితల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన కోలగట్ల

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

మూడు లాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న చదురు గుడిలో పైడితల్లి అమ్మవారిని మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సాదర స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని విస్తృత పరిచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని లక్ష్యం పని చేస్తున్నామన్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వ్యాపారులకు ఇస్తున్నామన్నారు. త్వరితగతిన ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, నిత్య అన్నదానాన్ని ఈ ప్రాంతంలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట దేవాలయ పాలకమండలి సభ్యులు ఎంకెబి, పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, గంధం లావణ్య, చిల్లా పుష్ప, రామ్ సింగ్ సూరమ్మ, పార్టీ నాయకులు వేత్సా సాయి, చిల్ల వాసు, గంధం హరిబాబు, గొల్లపూడి మాధవరావు, వంకాయలపాటి శ్రీనివాసరావు, ముద్దాడ రాజు తదితరులున్నారు.



అర్చకుల ఆశీర్వచనం పొందుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కిమ్మి-రుషింగి వంతెన పూర్తయ్యేనా?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మీ - రుషింగి గ్రామాల మధ్య నాగవళి నదిపై వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యానా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. 2008 సెప్టెంబరు 26న జరిగిన పడవ బోల్తా ప్రమాదంలో ముగ్గురు చిన్నారులతో పాటు ఐదుగురు జల సమాధి అయిన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో స్పందించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండు గ్రామాల మధ్య నాగవళి నదిపై వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.27కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ రెండు అపార్ట్మెంట్లతో పాటు 16 పిఆర్‌లు నిర్మించాల్సి ఉంది. వీరఘట్టం మండలం వైపు దాదాపుగా 12 పిఆర్‌లు పూర్తయ్యాయి. వంగర మండలం వైపు నాలుగు పిఆర్‌లు పూర్తి కావాల్సి ఉంది. అయితే 12,13 పిఆర్ లమధ్య స్లాబ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే రెండు పిఆర్‌ల మధ్య ఐరన్ రాడ్లు అమర్చారు. 2012లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. నేటికి 11 ఏళ్లయినా వంతెన పనులు పూర్తి కాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రస్తుతం నది నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నదిలోనే నడక ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని వీరఘట్టం- వంగర మండలాల ప్రజలు ముక్తకంఠతో కోరుతున్నారు.



స్లాబ్ వేసేందుకు సిద్ధం చేసిన సామగ్రి

ప్రజాశక్తి
www.prajasakti.com


నిర్మానుష్యంగా మారిన పార్వతీపురం ప్రధాన కూడలి

నిర్మానుష్యంగా కూడళ్లు

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు మంగళవారం నిర్మానుష్యంగా మారాయి. ముక్కనుమ సందర్భంగా ప్రధాన కూడళ్లు అన్నీ జనసంచారం లేక బోసిపోయాయి. సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లిన వారు ఇంకా తిరిగి రాకపోవడంతో పట్టణంలోని రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి.


కురుపాం: కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

గిరిశిఖర గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

కురుపాం : మండలంలోని వలసబల్లేరు పంచాయతీలోని గిరిశిఖర గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హర్ష కుమార్ 39 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారికి శారీరక దృఢత్వం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వేడినీరు తాగాలని, దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నర్సిపురం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్.తనూజ పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు వండి పెట్టే భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు రుచికరమైన ఆహారాన్ని అందజేయాలని కార్యకర్తను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవీనమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


మాంసం దుకాణం వద్ద గుమిగూడిన జనం

కిటకిటలాడిన మాంసం దుకాణాలు

పార్వతీపురం టౌన్ : గత రెండేళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా పండగలకు విముఖత చూపించిన ప్రజలకు ఈ ఏడాది కొంత ఊరట లభించిందనే చెప్పొచ్చు. ఈ ఏడాది ముక్కనుమ సందర్భంగా మంగళవారం తెల్లవారు జాము నుంచే చికెన్, మటన్, చేపల దుకాణాలు కిటకిటలాడాయి. మాంసం కొనుగోలుకు స్థానికులు గంటల కొద్ది నిరీక్షించాల్సిన వచ్చింది. ఇదే అదునుగా వ్యాపారులు అదనంగా వసూలు చేసిన పరిస్థితి కనిపించింది.

బాధిత కుటుంబానికి భూదేవి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భూదేవి

సీతంపేట : సీతంపేట మండలంలోని పెదబగ్గ గ్రామంలో కొండగొర్రి సావిత్రమ్మ కూతురు విజయమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకురాలు పడాల భూదేవి ఆ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామకృష్ణ, చిలకమ్మ, బుద్ధుడు పాల్గొన్నారు.


ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు

నీలమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

కురుపాం : మండలంలో తూర్పుముఠా మొండెంఖల్ గ్రామంలో దొంతుకొండపై ఉన్న నీలమ్మ తల్లి ఆలయానికి ముక్కనుమ సందర్భంగా మంగళవారం యాత్రికులు పోటెత్తారు. ప్రతి ఏటా సంక్రాంతికి మొండెంఖల్, చుట్టుపక్కల గ్రామాలకు వచ్చిన కొత్త అల్లుళ్లు, బంధువులతో నీలమ్మ తల్లిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా నీలమ్మతల్లి ఆలయ ప్రాంగణం మంగళవారం సాయంత్రం యాత్రికులతో కిటకిటలాడింది.

జీడికి ఏదీ ప్రోత్సాహం?

- మూడేళ్లుగా తగ్గుతున్న దిగుబడి
- కారుమబ్బులు, పొగమంచుతో పంటనష్టం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో గిరిజన రైతులకు ప్రధానమైన పంటలు జీడి, చింత. అధిక శాతం రైతులు ఈ రెండు పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే గత మూడేళ్ల నుంచి కారు మబ్బులు కారణంగా జీడి పంట దిగుబడి తగ్గుతూ వస్తుంది. గత రెండేళ్లలో దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జీడి ప్రస్తుతం పిందె సమయంలో ఉంది. పూతకు వచ్చేసరికి కారు మబ్బులు కమ్ముకుంటే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా కమ్ముకున్న కారుమబ్బులు, కురుస్తున్న పొగ మంచుతో జీడి దిగుబడి ఏ విధంగా ఉంటుందో అర్థం కావడం లేదని రైతులకు చెబుతున్నారు. ఇదే కొనసాగితే జీడి పంటకు నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. మరోవైపు చింతపండు గిరిజనులకు ఆదాయ వనరుగా ఉన్నా ప్రభుత్వం ఆన్లైన్ చెల్లింపులు విధానం తీసుకురావడంతో జిసిసి అధికారులకు అమ్ముకునేందుకు గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. దీంతో బయట వ్యాపారులకు అమ్మకాలు చేపట్టడంతో గిట్టుబాటు ధర లేదని అంటున్నారు.


ఏజెన్సీలో జీడి తోటలు

ఈ ఏడాది అకాల వర్షాలు, కారు మబ్బులు కారణంగా ఇప్పటి వరకూ పూత కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేలాది ఎకరాల్లో సాగు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు 10 వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తోందని అంచనా. దీన్ని బట్టి చూస్తే గిరిజన రైతులు జీడి పంటపై ఎంత మేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతుంది. పుష్కలమైన జీడి తోటలున్నప్పటికీ మద్దతు ధర లభించకపోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందలేకపోతున్నారు.

ముందుకు రాని ప్రభుత్వ సంస్థలు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ప్రతి ఏటా జీడి పంట వ్యాపారం కోట్లాది రూపాయలు జరుగుతున్నా జిసిసి, ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. దీంతో దళారుల బెడద ఎక్కువ కావడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. చింతపండుతో పాటు జీడి పంటను కూడా గతంలో జిసిసి అధికారులు కొనుగోలు చేసేవారు. అయితే సంస్థకు నష్టాలు వచ్చాయని కొనుగోలు నిలిపివేశారు. దీంతో చేసేది లేక అప్పటి నుంచి గిరిజనులు జీడి పంటను బయట వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.

దృష్టి సారించని ప్రభుత్వ అధికారులు

ఏజెన్సీలో గిరిజన రైతుల ప్రధాన పంట జీడి అయినప్పటికీ పంట సాగుకు అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. పూత రాలకుండా అధికారులు రాయితీపై పురుగు మందులు అందజేసి పంట సాగుకు అవగాహన కల్పించే చర్యలు ఎక్కడా కానరావడం లేదని అంటున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పర్యటనకే పరిమితం తప్ప సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.


జీడి ప్రాసెసింగ్ యూనిట్ కేంద్రం

మూలనపడ్డ జీడి ప్రోసెసింగ్ యూనిట్లు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన జీడి ప్రోసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి నోచుకోకుండానే మూలనపడ్డాయి. గిరిజనులు సేకరించిన జీడిపిక్కలను ప్రోసెసింగ్ చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి పరికరాలను కొనుగోలు చేశారు. ప్రోసింగ్ విధానంపై కొంతమంది గిరిజన యువత, మహిళలకు శిక్షణ కూడా అందించారు. వీటికి రూపకల్పన చేసినప్పటి ఐటిడిఎ పిఒ సువర్ణపండ దాస్ బదిలీపై వెళ్లడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

తీవ్రంగా నష్టపోతున్నారు....

జీడి పంట పూత సమయంలో తేనెమంచు ఎక్కువగా కురవడంతో గత రెండేళ్ల నుంచి పంట దిగుబడి తగ్గింది. దీంతో గిరిజన రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. వేలాది మంది రైతులు జీడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అధికారులు గుర్తించి రైతులకు సబ్సిడీపై క్రిమిసంహారక మందులు పంపిణీ చేయాలి.

మండంగి రమణ,
ఎంపిటిసి, చెముడుగూడ.

నష్టపరిహారం ఇవ్వాలి

గతేడాది పంట నష్టపోయిన జీడి రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. మూతపడిన జీడి ప్రాసెసింగ్ యూనిట్లు తెరిచి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. వ్యవసాయ యాజమాన్య పద్ధతుల్లో జీడి పంటలపై అవగాహన కల్పించాలి.

కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు

సమస్యలకు నిలయం.. వీరఘట్టం

- అభివృద్ధికి నోచుకోని మేజర్ పంచాయతీ
- ఎక్కడి సమస్యలు అక్కడే
- ప్రచారాలకే పరిమితమవుతున్న పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

కలియుగ భీముడు, మల్ల యోధుడు, ఇండియన్ హెర్క్యులేస్‌గా పేర్కొందిన కోడి రామ్మూర్తి నాయుడు స్వగ్రామం వీరఘట్టం నేడు అనేక సమస్యలతో దర్శనమిస్తుంది. అప్పట్లో ఘట్టంగా ఉన్న ఈ గ్రామం కోడి రామ్మూర్తి నాయుడు వీరునిగా అనేక బిరుదులు పొందడంతో వీరఘట్టంగా నామకరణ చేశారు. కీర్తిశేషులు విశ్వాస రాయి నరసింహదొర, బిడ్డిక సత్యం, నిమ్మక గోపాలరావు, పాలవలస రాజశేఖరం, తదితర ప్రజాప్రతినిధులు ఇదే ప్రాంతానికి చెందినవారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు విశ్వాసరాయి కళావతి, పాలవలస విక్రాంత్ ఈ ప్రాంతం వారే. అయినా వీరఘట్టం అభివృద్ధిపై వీరెవరూ దృష్టి సారించకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్న విమర్శలు వెళ్లువెత్తుతున్నాయి.

30పడకల ఆసుపత్రి ప్రకటనలకే పరిమితం

స్థానిక ఆరుపడకల పిహెచ్‌సిని 30 పడకలుగా తీర్చిదిద్దుతామని 2017లో గత ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ వీరఘట్టం ఆసుపత్రిని సందర్శించిన హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్న ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఉన్న ఆరు పడకలకే పరిమితమైంది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తీరని మార్కెట్ సదుపాయం

ఈ ప్రాంతంలో కూరగాయలు అధికంగా సాగు చేస్తున్న రైతులు వారు పండించిన పంటను అమ్ముకొనేందుకు వీలుగా మార్కెట్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లేట్లతో కూరగాయలను రోడ్లుపైన నుంచి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కారణంగా వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.


అభివృద్ధికి నోచుకోని ప్రధాని రహదారి

అగ్నిమాప కేంద్రం లేక అవస్థలు

మండలంలో ఏ సమయంలోనైనా అగ్ని ప్రమాదం జరిగితే అందుబాటులో అగ్నిమాపక వాహనం లేకపోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొండ అగ్నిమాపక కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ వాహనం ప్రమాద స్థలానికి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

డిగ్రీ కళాశాల లేక విద్యార్థుల ఇబ్బందులు

డిగ్రీ కళాశాలకు భవన సదుపాయం లేకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు జరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిగ్రీ కళాశాల మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం వరకు జూనియర్ కళాశాల విద్యార్థులకు తరగతులు జరుగుతాయి. దీనికి తోడు అరొకర తరగతి గదులు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించేందుకు వీరఘట్టానికి సమీపంలో మరియగిరి వద్ద ఐదు ఎకరాల స్థలం కేటాయించినప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఏర్పాటు చేసిన స్థలం నిరుపయోగంగా ఉంది.

అభివృద్ధికి నోచుకోని రహదారి

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ 5.5 కోట్లతో వట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు ప్రధాన రహదారిని అభివృద్ధి పర్చేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 19న ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ శంకుస్థాపన చేశారు. నెలలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రధాన రహదారి పనులు చేపట్టికపోవడంతో రోజుకు వందలాది వాహనాలు రాకపోకలతో దుమ్ము రేగిపోతుంది. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారులు, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు

మండల కేంద్రంలోని ఇటీవల కాలంలో పాత బస్టాండ్‌లో బస్సు షెల్టర్ నిర్మించినప్పటికీ వాటి రూపురేఖలు మార్చి నాలుగో సచివాలయంగా వినియోగిస్తున్నారు దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండా, వానల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాటు వట్టిగెడ్డ వంతెన వద్ద, అంబేద్కర్ కూడలి వద్ద ఎటువంటి ఆధారం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్యలేని వీరఘట్టం గ్రామముగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధరేదీ?

ప్రజాశక్తి -సీతంపేట

గిరిజనులు ఆరు కాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు అందోళన చెందుతున్నారు. జిసిసి, వెలుగు వంటి ప్రభుత్వ సంస్థలు ఉన్నప్పటికీ కొన్ని ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. మిగిలిన ఉత్పత్తులను దళారులకు అమ్ముకొని నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండలపైన సేంద్రియ పంటలతో పాటు ప్రకృతి సహజసిద్ధమైన, స్వచ్ఛమైన పంట ఉత్పత్తులు పండించి సంతలకు గిరినులు తీసుకొస్తున్నారు. ప్రతి నెలా ఏదో ఒక ఉత్పత్తిని సంతకు తెస్తారు. దీనికి తగ్గట్టు మార్కెట్ ధర లేకపోవడంతో ఆందోళన చెందుతుంటారు. కొండచీపుర్లు కొండలపైన సేకరించి కట్టలు కట్టి సంతకి తీసుకొచ్చినప్పటికీ కొండచీపురు రూ.50లోపే కొనుగోలు చేస్తున్నారు. దళారులు మాత్రం కారు చౌకగా కొనుగోలు చేసి కట్టలు విడగొట్టి ప్లాస్టిక్ వైరుతో సుందరంగా తీర్చిదిద్ది అధిక రేట్లకు పట్టణాల్లో విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. ఇక పనసకాయలు చిన్నది రూ.20, పెద్ద కాయ రూ.30కు విక్రయిస్తున్నారు. అయితే విజయనగరం విశాఖపట్నం రాజమండ్రి విజయవాడ హైదరాబాద్, ఒడిశాలోని పర్లాకిమిడి, భువనేశ్వర్ వంటి పట్టణాల్లో కిలోల ప్రకారం అధిక ధరలకు విక్రయిస్తారు.

ఇక సీతంపేట ఏజెన్సీలో చింతపండు అంటే పట్టణవాసులు చెవి కోసుకుంటారు. చింతపండు పుల్ల పుల్లగా తీయ తియ్యగా ఉండటంతో దళారులు సంతకు వచ్చే సిండికేట్‌గా మారి చింతపండు కావిడి రూ.800 చొప్పున కొనుగోలు చేసి పట్టణాల్లో కిలోలు చొప్పున అమ్ముతారు. కర్ర పెండ్లాం ఈ పండుగ సీజన్లో దొరుకుతుంది. సంక్రాంతికి కలగాయకూరగా తింటారు. ఇది కూడా కావిడ చొప్పున కొనుగోలు చేసి కిలోల ప్రకారం వ్యాపారులు అమ్ముతారు. జీడిపంట ఏజెన్సీలో విస్తారంగా కాపుకు వచ్చినప్పటికీ అది కొనుగోలు చేయడానికి ప్రభుత్వ సంస్థలు ముందుకు రాకపోవడంతో దళారులు సిండికేట్‌గా మారి గిరిజనులను దోచుకుంటున్నారు. అలాగే ఏజెన్సీలో రామఫలాలు, సీతాఫలాలు అడవిలో పండుతాయి. ఇవి సీతంపేట, దోనుబాయి, మర్రిపాడు, కుసిమి, పూతికవలస సంతకు తెచ్చి విక్రయిస్తారు. ఈ ఫలాల్లో మంచి పోషకాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఉత్పత్తులు ప్రభుత్వ సంస్థలు అన్నీ కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించాలని ఐటీడీఏ వద్ద ధర్నాలో చేపట్టిన సందర్భంలో ఎన్నో ఉన్నాయి. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎట్టకేలకు దళారులకే విక్రయించాల్సి వస్తోంది. గతేడాది పైనాపిల్‌ను ఐటిడిఎ పిఒ బి.నవ్య చొరవతో ప్రభుత్వం కనుగోలు చేసింది. అలాగే మిగితా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని గిరిజనులు పాలకులను కోరుతున్నారు.

రోడ్డుపై విక్రయిస్తున్న గిరిజనులు


యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఏజెన్సీలో అధికంగా టేకు, పనస, గుగ్గిలం, ఏగేసి మద్దిస కలపను స్మగ్లర్లు అక్రమంగా నరికి దోచుకుపోతున్నారు. మండలంలో చిన్నబగ్గ, పూతికవలస, పొల్ల దోనుబాయి, శంభాం, కడగండి తదితర ప్రాంతాల నుంచి కలపను స్మగ్లర్లు యథేచ్ఛగా రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేసినప్పటికీ అటవీ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికంగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, పికప్ వాహనలతో రవాణా చేస్తున్నారు. నేరుగా ఇవి ఒడిశాలోని పర్లాకిమిడి వెళ్తున్నాయి. ఇక పండగ సీజన్‌లో అయితే సిబ్బంది పండగ సీజన్లో నిమగ్నమైతే కలప స్మగ్లర్లకు ఇదే అదును చేసుకొని ఎక్కువగా కలపను తరలించుకుపోతున్నారు. వర్షాకాలంలో తుఫాన్‌లో కూడా అదే ఆసరాగా తీసుకొని నేలకు ఒరిగిన చెట్లతో పాటు బతికున్న చెట్లు కూడా నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో కలప అధికంగా సేవ ఉంటుందని పట్టణవాసులు ఇష్టపడతారు. మన్యం ప్రాంతం నుండి కలప కొత్తూరు, రొట్టవలస, ఆముదాలవలస, రాజాం, పాలకొండ మిల్లులకు తరలిపోతుంది. సీతంపేట ఏజెన్సీలో అక్రమ కలప నివారించడానికి ఏర్పాటు చేసిన బేస్ క్యాంపుల్లో అధికారులు, సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి అడవులను రక్షించాలని గిరిజనులు కోరుతున్నారు.


రవాణాకు సిద్ధంగా ఉన్న కలప

గుదిబండగా డంపింగ్‌యార్డ్ సమస్య

- పట్టణవాసులకు దగ్గరలోనే కొనసాగుతున్న వైనం
- ప్రారంభంకాని కొత్త డంపింగ్‌యార్డ్ పనులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

డంపింగ్‌యార్డ్ సమస్య ఇప్పటిదికాదు. మేజర్ పంచాయతీ నుంచి కూడా ఈ సమస్య వెంటాడుతుంది. 2013లో మార్చిలో నగర పంచాయతీగా మార్చుతూ ఉత్తర్వులు వచ్చినప్పటికీ డంపింగ్‌యార్డ్ సమస్య మాత్రం తీరలేదు. ఇప్పటికే అనేక మంది కమిషనర్లు మారారు. ప్రత్యేకాధికారులుగా కూడా కొంతమంది పనిచేశారు. రెండు పాలకవర్గాలు మారాయి. మూడు ప్రభుత్వాలు మారాయి. అయినప్పటికీ ఈ సమస్య తీర్చే నాథుడే కరువవుతున్నాడు. నగర పంచాయతీ ప్రజలకు డంపింగ్‌యార్డ్ సమస్య పెద్ద సమస్యగానే తయారైంది. సుమారు 40వేల జనాభా ఉంది. 20 వార్డుల్లో 353 వీధులున్న ఈ నగర పంచాయతీకి డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆదినుంచి ఇబ్బందులే....

నగర పంచాయతీ ఏర్పడిన తరువాత మొదట్లో సిరికొండ దగ్గర డంపింగ్‌యార్డ్ కోసం అప్పటి పాలకవర్గం స్థలం కేటాయించారు. అయితే గిరిజనులకు డిపట్టాలున్నాయని దానిని అడ్డుకోవడంతో వెనక్కు వచ్చింది. మరలా అట్టలి ప్రాంతంలో డంపింగ్‌యార్డ్‌కు ప్రభుత్వం స్థలం కేటాయించింది. పాలకొండ చెత్తతో వాహనాలు అక్కడకు వెళ్లగా స్థానికులు అడ్డుకున్నారు. అట్టలి గ్రామస్తులు దీనిని వ్యతిరేకించారు. దీంతో అట్టలి దాటి టిడిపారాపురం దగ్గర్లో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. డంపింగ్‌యార్డ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. టిడిపారాపురం గ్రామస్తులు మొదట్లో అడ్డుకున్నప్పటికీ అధికారులు, స్థానిక రాజకీయ నాయకులు కలుగజేసుకుని వారితో మాట్లాడారు. పూర్తిగా ప్రహరీగోడ నిర్మించి ఆ గ్రామానికి సంబంధం లేకుండా చూస్తామని చెప్పడంతో వారు కూడా అంగీకరించారు. ఇందుకోసం రూ.40 లక్షలు నిధులు కేటాయించారు. సుమారు ఏడాది కాలం గడస్తున్నా ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదు. టెండర్లు కూడా పిలవని పరిస్థితి నెలకొంటుంది.

పట్టణవాసులకు దగ్గరలోనే....

ఎప్పటి నుంచో పట్టణవాసులకు దగ్గరలోనే తాత్కాలికంగా డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాపు చేశారు. సుమారు నాలుగేళ్ల నుంచి ఇదే పరిస్థితి కనిపిస్తుంది. కొత్తవీధి దగ్గర రజకుల చెరువు పక్కన రెండెకరాల స్థలంలో తాత్కాలిక డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాపు చేశారు. అయితే అప్పట్లో అధికారులు ఆరునెలల్లో దీనిని తొలగిస్తామని చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో కొత్తవీధి, శిర్లిపొతన్నవీధి, కోరాడవీధి, వెంకంపేట తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. స్థానికులు దీనిని వ్యతిరేకిస్తున్నా అక్కడే చెత్తను డంప్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పట్టణానికి దగ్గరిగా ఉన్న డంపింగ్ యార్డు

అదుపుతప్పి బైక్ బోల్తా

యువకుడు మృతి

కొమరాడ : మండలంలోని గంగరేగువలస గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు మృతి సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గంగరేగువలస గ్రామానికి చెందిన రావాడ రాజశేఖర్ (24) ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రావాడ రాజశేఖర్ తన ఇంటి వద్ద నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే సమయంలో బైకు అదుపుతప్పి బోల్తా పడింది. తీంతో రాజశేఖర్ తలకు తీవ్రగాయమైంది. దీంతో ఆయన ఘటనాస్థలంలోనే మరణించాడు. కింద పడిన వాహనాన్ని అదే సమయంలో కొమరాడ నుంచి పార్వతీపురం వైపు మరో బైక్ వెళ్తున్న వారు ఢీకొన్నారు. దీంతో బైక్ ఉన్న ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు హుటాహుటీన జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కొమరాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం రాజశేఖర్ మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. రాజశేఖర్ ఇతర ప్రాంతంలో పనిచేస్తూ పండగ నేపథ్యంలో ఊరికి వచ్చాడు. కుటుంబ బాధ్యతను మోస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. రాజశేఖర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రావాడ రాజశేఖర్


ఆత్మహత్య చేసుకున్న సూర్యనారాయణ

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న కొండగొర్రి సూర్యనారాయణ (46) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సూర్యనారాయణ బతుకు తెరువు కోసం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిలోకి ఎవరూ లేని సమయంలో సూర్యనారాయణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన భార్య అనారోగ్యంతో గత ఏడాది మృతి చెందింది. ఎల్విన్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా ; ఆరుగురికి గాయాలు

పార్వతీపురం రూరల్ : గరుగుబిల్లి మండలం నుంచి పార్వతీపురం వైపు వెళుతున్న ఆటో అడ్డాపుశిల గ్రామ సమీపంలో రహదారిపై బోల్తాపడింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు.